
బీఆర్ఎస్ మండల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పెద్దసారు మమ్మల్ని కలుస్తలేరు

- గెలిపించాక అసలు కనిపించనే లేదు
- మా కష్ట సుఖాలను పట్టించుకునేదెవరు?
- బీఆర్ఎస్ మనోహరాబాద్ సమావేశంలో

కేసీఆర్ తీరుపై నేతలు, కార్యకర్తల ఆవేదన

తూప్రాన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో పార్టీ ఇబ్బందులకు గురైనా కష్టపడి అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దసారు (కేసీఆర్)ను గెలిపించుకున్నాం, గెలిచిన తర్వాత మమ్మల్ని కలువడం లేదు. అసలే కనిపించకుండా పోతే కార్యకర్తల కష్ట సుఖాలను ఎవరు పట్టించుకుంటారు' అంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇమాంపూర్ శివారులో బీఆర్ఎస్ పార్టీ మనోహరాబాద్ మండల సమావేశాన్ని జిల్లా నాయకులు

మిగతా 8వ పేజీలో

నుమాయిష్‌లో ప్రాంతీయ జాతీయ గణాంక శాఖ స్టాల్

హైదరాబాద్ సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గణాంక మరియు పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న హైదరాబాద్ ప్రాంతీయ జాతీయ గణాంక కార్యాలయం అధికారులు నుమాయిష్-2025లో ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.అజిత్ కుమార్ ప్రారంభించారు. సాంఖ్యకశాస్త్ర ప్రాముఖ్యత, దేశ అభివృద్ధిలో గణాంకాల పాత్ర, విశ్వసనీయమైన సమాచారాన్ని సేకరించి దేశ ప్రణాళిక రచనలలో కీలక భాగస్వామ్యం వహిస్తున్న ఎన్ఎస్ఓ డేటా యొక్క ప్రాముఖ్యత గురించి ఈ స్టాల్‌లో అందుబాటులో ఉంచారు. డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ దేశంలో ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించే సర్వేలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ప్రణాళిక రచనలో సర్వేలు, గణాంకాల కీలక భాగస్వామ్యాన్ని అందరు గుర్తించాలని పేర్కొన్నారు. స్టాల్‌లో అందుబాటులో ఉంచిన సమాచారాన్ని అందరూ తెలుసుకొని భవిష్యత్తులో ఎన్ఎస్ఎస్ఓ జరిపే అన్ని సర్వేలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతిరెడ్డి, సీనియర్ స్టాటిస్టికల్ అధికారులు పాల్గొన్నారు.

వర్ణ శోభితం

ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి


ముగ్గులను పరిశీలిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి తదితరులు

సంగారెడ్డిటౌన్/సంగారెడ్డిక్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అందమైన రంగవల్లులు ఒక్కచోట చేరి కనువిందు చేశాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆదివారం సంగారెడ్డి పట్టణం శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాల వేదికగా సందడిగా జరిగాయి. వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమం పండుగలా సాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఈ పోటీలకు సంగారెడ్డి పట్టణంతో పాటు ఆయా మండలాల నుంచి మహిళలు తరలివచ్చారు. న్యాయ నిర్ణేతలుగా కొలాచల శ్వేతశర్మ, బీనవీన, సత్యవల్లి వ్యవహరించారు. చిన్నారులు మోక్ష, అస్మితలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

విజేతలు వీరే...

ముగ్గుల పోటీల్లో సంగారెడ్డి పట్టణానికి చెందిన కె.స్వప్న ప్రథమ బహుమతి (రూ.6వేలు), ద్వితీయ బహుమతి కె.ప్రేమల (రూ.4వేలు), తృతీయ బహుమతి ఎన్.రోజ (రూ.3వేలు) గెలుచుకున్నారు. మరో నలుగురు మహిళలకు కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్, కోంపల్లి విద్యాసాగర్, మ్యాడం రాధాకిషన్, జూలకంటి బుచ్చిలింగం, చందా శ్రీధర్, కటకం విజయ్, నామభాస్కర్ ప్రత్యేక బహుమతులు అందజేశారు.

'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు : టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

మహిళలను ప్రోత్సహించేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ఆంధ్రజ్యోతితో పాటు వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థ ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. మహిళలకు అన్ని విషయాలపై అవగాహన ఉంటేనే కుటుంబం బాగుంటుందన్నారు.

అన్ని రంగాల్లో ముందుండాలి : అదనపు కలెక్టర్ మాధురి

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి పిలుపునిచ్చారు. మహిళలు ఉన్నత చదువులు చదివితే కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే ముగ్గులు వేశారని అభినందించారు.

మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తాం: తోపాజీ అనంతకిషన్

వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సంస్థను 2008లో స్థాపించిన నాటి నుంచి అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు తోపాజీ అనంతకిషన్ పేర్కొన్నారు. పదిహేను సంవత్సరాలుగా అనేక సామాజిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్న తమ సంస్థకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఎంతో ప్రోత్సహిస్తున్నారని అన్నారు. మున్ముందు కూడా ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వస్తామని ఆయన తెలిపారు. అనంతరం సదాశివపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుమలత రైతులు, వ్యవసాయ రంగంపై పాట పాడారు. సంగారెడ్డి పట్టణ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రమీల ఆంధ్రజ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఉమ్మడి జిల్లా బ్యూరో ఇన్‌చార్జి అరుణ్ కుమార్, కౌన్సిలర్ ఉమా మహేశ్వరి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ ప్రదీప్, కాంగ్రెస్ నాయకులు మహేష్, రామాగౌడ్ పాల్గొన్నారు.

మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచేందుకు దోహదం



మహిళలను ప్రోత్సహించేందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. ఈ పోటీల్లో పాల్గొనడం మహిళలకు ఎంతో ఆత్మవిశ్వాసం ఇస్తుంది. సాధించగలమనే నమ్మక కలిగిస్తుంది. మొదటి బహుమతి గెలుచుకోవడం సంతోషంగా ఉంది.

-కె.స్వప్న, సంగారెడ్డి, ప్రథమ బహుమతి

ముగ్గుల పోటీలతో ప్రతిభకు గుర్తింపు



'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రకటన చూసి పోటీల్లో పాల్గొన్నా. రెండో బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఇటువంటి పోటీల్లో పాల్గొనడంతో ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. పోటీలు నిర్వహించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు ధన్యవాదాలు.

-కె.ప్రేమల, సంగారెడ్డి, ద్వితీయ బహుమతి

మహిళలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది



ముగ్గుల పోటీలు మహిళలకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఈ పోటీల్లో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు ప్రతిభను చాటుకొనే అవకాశం కల్పించేందుకు ముగ్గుల పోటీలు నిర్వహించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్‌కు అభినందనలు.

-ఎన్.రోజా, సంగారెడ్డి, తృతీయ బహుమతి



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలో మొదటి బహుమతి సాధించిన ముగ్గు


ముత్యాల ముగ్గుల పోటీలో రెండో బహుమతి సాధించిన ముగ్గు


ముగ్గుల పోటీలో మూడో బహుమతి సాధించిన ముగ్గు

భూభారతితో సాదాబైనామాలకు మోక్షం

కొత్త ఆర్వోఆర్ చట్టంతో భూమి హక్కులు వర్తింపు

మెదక్ జిల్లాలో 12వేల దరఖాస్తులు

మెదక్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్కార్ తీసుకువస్తున్న భూ భారతి ఆర్వోఆర్ 2024 చట్టం ద్వారా లిఖితపూర్వక ఒప్పందంతో భూములు కొనుగోలు చేసిన రైతన్నలకు మేలు కలగనుంది. 2014 జూన్ 2వ తేదీకి ముందు తెల్లకాగితాలపై రాసుకున్న (సాదాబైనామా) కొనుగోళ్ల ఒప్పందాలను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఆర్వోఆర్-2024 చట్టం సెక్షన్ 6(10)ను తీసుకొచ్చింది. గతంలో సాదాబైనామాల ద్వారా పంట భూములు కొనుగోలు చేసి అనుభవిస్తున్నా వాటికి తగిన పత్రాలు లేకపోవడంతో ప్రభుత్వం వారిని రైతులుగా గుర్తించడం లేదు. రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హత దక్కడంలేదు. ప్రభుత్వం సాదా కాగితంపై రాసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోని వారి భూములను క్రమబద్ధీకరించేందుకు గతంలో దరఖాస్తులు తీసుకున్నా వాటిని పరిష్కరించలేదు. ప్రస్తుతం కొత్త ఆర్వోఆర్ చట్టం ద్వారా సాదాబైనామాలకు భూహక్కులు కల్పిస్తామని ప్రకటించింది. ఆర్డీవో స్థాయి అధికారి విచారణ జరిపాకే ఈ క్రమబద్ధీకరణ జరగనుంది.

భారీగా దరఖాస్తులు

గతంలో పల్లెల్లో తెల్లకాగితాలపై ఒప్పంద పత్రాలు రాసుకుని అనేకమంది రైతులు భూములు కొనుగోలు చేసినా పట్టా చేసుకోలేదు. ధరణికి ముందున్న ఆర్వోఆర్ చట్టంలో సాదాబైనామాలతో పట్టాలు చేశారు. కానీ ధరణి వచ్చిన తర్వాత ఆ పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వం కూడా క్రమద్ధీకరణకు దరఖాస్తులు తీసుకోగా మెదక్ జిల్లాలో 12 వేల దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వం దరణికి బదులుగా భూభారతి చట్టం తీసుకొచ్చింది.

మిగతా 8వ పేజీలో


జీడిపల్లి పంచాయతీ కార్యాలయంలో సీసీ కెమెరాల కమాండ్‌రూంను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

7

మూడేళ్లకే పునాదికి బీటలు..

- ప్రమాదకరంగా మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు

8

కోహీర్‌లో తగ్గని చలి

ఆదివారం ఉదయం 7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు


ఆదివారం ఉదయం మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రాన్ని కమ్మేసిన పొగమంచు

కోహీర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. వారం రోజులుగా చలి తీవ్రత పెరుగుతూ వస్తున్నది. శనివారం రికార్డు స్థాయిలో 6 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోగా.. ఆదివారం ఉదయం 7.1 డిగ్రీలుగా నమోదయింది. ఉదయం చలి, పొగమంచుకు ఈదురుగాలు కూడా తోడుకావడంతో తీవ్రత మరింత పెరుగుతున్నది. ప్రజలు ఉదయం 9 గంటలు దాటినా ఇంట్లో నుంచి బయటికి రావడం లేదు. తప్పని పరిస్థితుల్లో పాలవ్యాపారులు, వ్యవసాయదారులు, పరిశ్రమలకు వెళ్లే కార్మికులు స్వెట్టర్లు, మంకీక్యాప్‌లు ధరించి తమ పనులకు వెళ్లారు. మరో రెండు రోజులు చలి తీవ్రత కొనసాగుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు

కోహీర్ 7.1, అల్గోల్ 7.7, మల్‌చెల్మ 9.5, మొగుడంపల్లి 9.8, సత్వార్ 9.8, న్యాల్‌కల్ 6.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లా చిప్పల్‌తుర్తి 10.7, నర్సాపూర్ 11.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట-భూమ్‌పల్లి 10.9, కొండపాక 11.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఏసు సన్నిధిలో భక్తుల కోలాహలం



ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి బిషప్ శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం మత గురువు శ్రీనివాస్ దైవసందేశాన్ని వినిపించారు. రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. చర్చి ఆవరణలోని శిలువ వద్ద భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించారు.

-మెదక్ కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

చల్లంగ చూడు ఏడుపాయల దుర్గమ్మ..



ఏడుపాయల వనదుర్గాభవాని మాత క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయాన్నే అమ్మవారికి విశేష అలంకరణ చేసిన పురోహితులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చున్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.

-పాపన్నపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి)

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- ఆంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా విషయంలో రైతులను మోసం చేసిందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన ఖేడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంవత్సరానికి ఎకరాకు రూ.15 వేలు రైతు భరోసా పథకం కింద ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పి, ప్రస్తుతం రూ.12 వేలకే పరిమితం చేసిందని మండిపడ్డారు. వానాకాలం సీజన్‌లో అసలే ఇవ్వకుండా రైతులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ నిలబెట్టుకుని ఈనెల 26 వరకు రైతులందరికీ రూ.15 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ముందు సాగునీటిని అందించి, సాగు భూములకే భరోసా ఇస్తామని తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మనూరు మండల అధ్యక్షుడు విఠల్‌రావుపాటిల్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ పరశురాం, కౌన్సిలర్ కవితావిఠల్, పట్టణ అధ్యక్షుడు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లూరు బండపై వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

సిద్దిపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : పుల్లూరు బండ స్వయంభూ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రంలో ఈ నెల 10న వైకుంఠ ఏకాదశి ఉత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయం వంశపారంపర్య అర్చకుడు కలకుంట్ల రంగాచార్య తెలిపారు. ఆదివారం బండపై ఆలయం వద్ద కార్యక్రమ ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయంభువుగా వెలసిన పుల్లూరు బండ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం ఉదయం నుంచి విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించి ఉత్తర ద్వారం గుండా స్వామిని ఆలయంలోకి తీసుకెళతామని తెలిపారు. అనంతరం స్వామి వారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పొడిచేటి శ్రీనివాసాచారి, పుల్లూరు బండ దేవస్థాన కమిటీ చైర్మన్ పుల్లూరు కనకయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎజాజ్‌ఖాన్, తదితరులు

జహీరాబాద్, జనవరి5(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో ఆదివారం అంతర్‌రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఫుట్‌బాల్ కోచ్ ఏజాజ్‌పాషా, టోర్నమెంట్ అధ్యక్షుడు రాములు నేత, తదితరులు పాల్గొని క్రీడాకారులతో కరచాలనం చేసి ప్రారంభించారు. మొదటిరోజు జైసేవాలాల్ సీసీ-సాహసీసీ జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో నాయకులు నామరవికిరణ్, జ్యోతిపండాల్, అబ్దుల్లా, మహబూబ్, అఫ్సర్ దిల్దార్, కమిటీ సభ్యులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తక్షణమే చేపట్టాలి

- మహాజన సోషలిస్టు పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అబ్రహంమాదిగ

ఝరాసంగం, జనవరి5(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తక్షణమే చేపట్టాలని మహాజన సోషలిస్టు పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఝరాసంగం మండల ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వేయిగొంతులు - లక్ష డప్పుల మహా ప్రదర్శనకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



కె.ప్రేమలకు(ద్వితీయ) జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు



ఎస్.రోజాకు(తృతీయ) జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు



మాట్లాడుతున్న నిర్మలాజగ్గారెడ్డి



సంగారెడ్డి సెయింట్ ఆంథోనీస్ స్కూల్‌లో ముగ్గు వేస్తున్న మహిళ



నారాయణుడి ముగ్గు వేస్తున్న యువతి





సంగారెడ్డి జిల్లా ముత్యాల ముగ్గుల పోటీల ప్రథమ విజేత కె.స్వప్నకు జ్ఞాపికను అందజేస్తున్న అతిథులు, ముగ్గు వేస్తూ జయారెడ్డి

ముగ్గులొలికే..

సందడిగా ముత్యాల ముగ్గుల పోటీలు



యువతులు, మహిళలు వేసిన రంగవల్లులు భువిపై హరివిల్లును తలపించాయి. సంక్రాంతి పండుగ ముందే తెచ్చింది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్ట్‌నర్ క్రాఫ్ట్ వారి పర్ఫెక్ట్... ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్ సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్).. ఆదివారం సంగారెడ్డి పట్టణం శాంతినగర్‌లో వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో సెయింట్ ఆంథోనీస్ పాఠశాల వేదికగా పండుగ వాతావరణంలో సాగింది.







సిద్దిపేటలో వేసిన ముగ్గు



సంగారెడ్డి సెయింట్ ఆంథోనీస్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు



సిద్దిపేటలో ముగ్గు వేస్తున్న యువతి

పెళ్లికి పెద్దలు నిరాకరిస్తారని..

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- యువకుడి మృతి
- నిలకడగా యువతి ఆరోగ్యం



సాగర్ (ఫైల్)

సిద్దిపేట రూరల్, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : వారిద్దరూ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై ప్రేమించుకున్నారు.. వారి ప్రేమ వివాహానికి పెద్దలు నిరాకరిస్తారని ఆ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా, యువతి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నది. ఈ ఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలో చోటుచేసుకోగా ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామానికి చెందిన రామంచ సాగర్(22) సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సాగర్‌కు మూడు నెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో హైదరాబాద్‌కు చెందిన యువతి పరిచయమైంది. వారి పరిచయం ప్రేమగా మారింది. వీరి ప్రేమను కుటుంబసభ్యులు అంగీకరించరనే భావనతో డిసెంబరు 22వ తేదీన సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామ శివారులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అనంతరం సాగర్ తన కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి, ప్రేమికులిద్దరు బైక్‌పై సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. సాగర్ కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని వారిని మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాగర్ ఆదివారం మృతి చెందాడు. యువతి ఆరోగ్యం నిలకడగా ఉంది. సాగర్ సోదరుడు మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం

ఢీకొని ఒకరి మృతి



తాటిపాముల కనకయ్య మృతదేహం

జగదేవ్‌పూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌కు చెందిన తాటిపాముల కనకయ్య(60) స్థానిక కేశిరెడ్డి ఫంక్షన్‌హాల్ వైపు వెళ్తుండగా వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ విధానాలతో నష్టాల్లోకి విద్యుత్ సంస్థలు

- విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తే సమ్మె తప్పదు
- ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్
- రెండో రోజు కొనసాగిన మహాసభలు



మాట్లాడుతున్న ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్

సిద్దిపేట అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధానాలతో విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి వెళుతున్నాయని, వాటిని సాకుగా చూపి విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి మోదీ సర్కార్ ప్రయత్నాలు చేస్తుందని ఈఈఐఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుదీప్ దత్ ఆరోపించారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీయూఈఈయూ) రాష్ట్ర నాలుగో మహాసభలు రెండో రోజైన ఆదివారం సిద్దిపేటలో కొనసాగాయి. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, అధ్యక్షుడు ఈశ్వరయ్యతో కలిసి సుదీప్ దత్ మాట్లాడారు. చండీఘర్, రాజస్థాన్‌లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్రం ప్రయత్నించగా, వాటిని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో 48 జిల్లాలలో ప్రైవేట్ సంస్థలకు విద్యుత్ రంగాన్ని అప్పగించారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ అందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. కేవలం రెండేళ్లలో పూర్తి చేయాల్సిన యాదాద్రి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏడేళ్ల నుంచి నిర్మిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022 విద్యుత్ సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, చండీగర్‌లో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణతో ఉద్యోగులు, రైతులు, ప్రజలందరికీ నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. బోరుబావులపై ఆధారపడి పని చేస్తున్న రైతులందరిపై భారం పడుతుందని, అప్పుడు వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోతుందని స్పష్టం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ రంగంలో పనిచేస్తున్న వారందరమూ ఏకమై ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మహాసభలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన రాళ్ల బండి శశిధర్, యూనియన్ కంపెనీ అధ్యక్షుడు సింగిరెడ్డి చంద్రారెడ్డి, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాట మధు, యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ గుంటుపల్లి సధాకర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు ర్యాకం అశోక్, నాయకులు, జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వొద్దు

- ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి
- సర్వ శిక్షా ఉద్యోగుల డిమాండ్ న్యాయమైంది
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సిద్దిపేటలో ఆదివారం నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖను మొదట ప్రక్షాళన చేయాలన్నారు. కొత్త రెవెన్యూ చట్టం ద్వారా అయినా రైతులకు మేలు జరగేలా చూడాలని కోరారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని, నిరుపేదలను గుర్తించి వారికి న్యాయం చేయాలని అన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్ న్యాయమైందని ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికుల డిమాండ్‌పై జీవో విడుదల చేయాలని కోరారు. సీపీఐ శత ఆవిర్భావ వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 99 సంవత్సరాలుగా సీపీఐ పార్టీ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని నిలబడిందని, ఎన్నో ఉద్యమాలను నిర్వహించిందని అన్నారు. మోదీ ప్రభుత్వం మతోన్మాదంతో ప్రజలను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. జమిలి ఎన్నికలతో ప్రమాద సూచికలు కనిపిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల కనుసైగలలో పని చేస్తుందని విమర్శించారు. భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రజాసంఘాలే ప్రధాన పట్టుకొమ్మలని చాడ వెంకట్‌రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అన్నారు. సీపీఐ, అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలను గుర్తు చేశారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిలో సభ్యత్వ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, నాయకులు గడిపే మల్లేష్, కిష్టాపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, గణేష్, అశోక్, వెంకటరెడ్డి, జనార్దన్, మధు, నరేష్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తి పై కేసు నమోదు

సిద్దిపేట రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామానికి చెందిన ఓ యువతిని చిన్నకోడూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన నిఖిల్‌రెడ్డి ఐదేళ్ల నుంచి ప్రేమిస్తున్నానని చెప్పి దగ్గరయ్యాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. యువతికి సంబంధించిన న్యూడ్ ఫొటోలను తీసి, ఇంటర్నెట్‌లో పెడతానని భయపెడుతూ ఆమెను బెదరించాడు. కాగా, ఇటీవల ఆ యువకుడికి మరో యువతితో ఎంగేజ్మెంట్ జరిగింది. తన పెళ్లికి అడ్డు రావద్దని, తాను వేరే వివాహం చేసుకుంటున్నానని నిఖిల్‌రెడ్డి యువతితో చెప్పడంతో ఆమె సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

ఖోఖో రిజిస్టర్ సొసైటీల జాబితాను అందజేయండి

ఫుల్‌కల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలాల వారీగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఖోఖో సొసైటీల డాక్యుమెంట్‌లను అడ్‌హక్ కమిటీకి ఇవ్వాలని ఖోఖో ఉమ్మడి మెదక్ జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వై.మహేందరావు తెలిపారు. 7వ తేదీలోగా ఖోఖో అడ్‌హక్ కమిటీ సభ్యుడు, చేగుంట మండలం వడియారం పాఠశాల పీడీ ఎస్.నాగరాజుకు అందజేయాలని ఆయన సూచించారు. ఈ జాబితాను అనుసరించి ఉమ్మడి మెదక్ జిల్లా ఎన్నికలను నిర్వహిస్తుందన్నారు.

ప్రతీ గ్రామంలో

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

- మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మనోహరాబాద్ జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ద్వారానే సరైన సమయంలో కేసులను త్వరగా ఛేదించవచ్చని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన దాత దోమకొండ వేంకటరమణ సహకారంతో ఏర్పాటు చేసిన 68 సీసీ కెమెరాలను ఎస్పీ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సొంత గ్రామం కోసం ఏదో చేయాలని అడగకుండానే వెంకటరమణ తన సొంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. మనోహరాబాద్ మండలం పరిశ్రమలహబ్‌గా మారిందని, ఇతర రాష్ట్రల నుంచి అనేక మంది కార్మికులు, గుర్తుతెలియని వారు వస్తున్నారన్నారు. నేరాలు జరిగినప్పుడు వారిని త్వరితగతిన పట్టుకోవాలంటే సీసీ కెమెరాలు ముఖ్యం అన్నారు. ముఖ్యమంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి నెలంతా రోడ్డు భద్రతా దినోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. నేను సైతం అనే కార్యక్రమం ద్వారా మనోహరాబాద్ జాతీయ రహదారి గుండా 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. మద్యం తాగి వాహనాలను నడపొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, తూప్రాన్ సీఐ రంగా కృష్ణ, దాత దోమకొండ వెంకటరమణ, అనిత, అఖిల్, అక్షయ్, ఎస్ఐ సుభాష్‌గౌడ్, డీఐ రవికూమార్, బాలయ్య గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గాలిపటాల దుకాణాల్లో తనిఖీలు

సిద్దిపేట క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాలిపటాల దుకాణాల్లో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా దుకాణాల్లో ఉన్నా, ఎవరైనా విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నైలాన్, సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాలతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదకరమని తెలిపారు. బైక్‌పై వెళ్లే వారి మెడకు, కాళ్లకు తట్టుకొని చనిపోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. పర్యవరణానికి విపత్తుగా ఉండడంతో జాతీయ హరిత ట్రిబ్యూనల్ ఆదేశాల మేరకు చైనా మాంజా విక్రయాలు, వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని చెప్పారు. ఎవరైనా చైనా మాంజాను విక్రయిస్తున్నా, వినియోగిస్తున్నా డయల్ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న సిద్దిపేట టూటౌన్ పోలీసులు

క్రైం కార్నర్

గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

నర్సాపూర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం నర్సాపూర్ పట్టణానికి చెందిన ఎద్దు రవి(36) ఐదేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 3న గడ్డి మందు తాగడంతో కుటుంబీకులకు మొదటగా నర్సాపూర్ ఆస్పత్రికి, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతురు, కుమారులు ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడు..

శంకర్‌పల్లి, జనవరి5(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ విశ్రాంత ఉద్యోగి కోటేశ్వర్ రావు కుమారుడు తనోజ్(26) శనివారం రాత్రి ఇంటి నుంచి బైకుపై శంకర్‌పల్లికి పని నిమిత్తం వెళ్తున్నాడు. ఎదురుగా అతి వేగంగా వస్తున్న లారీ బైకును శంకర్‌పల్లిలోని సంగారెడ్డి రోడ్డులో బలంగా ఢీకొన్నది. దీంతో తనోజ్‌కు తీవ్రగాయలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

పటాన్‌చెరు, జనవరి (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రేతను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ సిబ్బంది ఆదివారం ఉదయం అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిస్సాకు చెందిన దీపక్‌కుమార్‌బెహ్రా పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ గంజాయిని విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ సిబ్బంది దాడులు చేసి 896 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి కిందపడి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని మెదక్ చేగుంట రహదారిపై కొర్విపల్లి గ్రామ శివారులో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే చిన్నశంకరంపేట ఎస్సీ హాస్టల్ కూకింగ్ మ్యాన్‌గా పని చేస్తున్న భిక్షపతి బైక్‌పై మెదక్ వెళ్తున్నాడు. అదే సమయంలో అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పుస్తెల తాడు చోరీ

పాపన్నపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : మహిళ మెడలోంచి బంగారు పుస్తెల తాడు తస్కరించిన సంఘటన ఏడుపాయల వనదుర్గామాత అలయ సమీపంలోని ఓ సత్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా బ్రాహ్మణపల్లికి చెందిన దేశాయిపేట స్రవంతి తన భర్తతోపాటు బంధువులతో కలిసి శనివారం సాయంత్రం ఏడుపాయలకు వచ్చింది. రాత్రి సమయంలో స్థానిక హరిత హోటల్ సమీపంలోని సిద్ధం శీను సత్రంలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి దుండగులు సత్రంలోకి ప్రవేశించి స్రవంతి మెడలోని సుమారు 2 తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లారు. కొంత సేపటికి నిద్రలేచిన ఆమె తన మెడలోని పుస్తెల తాడు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మూడేళ్లకే పునాదికి బీటలు..

● ప్రమాదకరంగా మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులు



మనూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.లక్షలు మంజూరు చేస్తున్నా.. కాంట్రాక్టర్ల అవినీతి, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో వృథాగా మారుతున్నాయి. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో అవి మున్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. అందుకు నిలువెత్తు నిదర్శనం మనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని తగగతి గదులే. మూడేళ్ల క్రితం నాసిరకంగా వీటిని నిర్మించడంతో ప్రస్తుతం పునాదులు బీటలు వారి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతోందనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

హోరాహోరీగా..

మెదక్ అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రెంజుకీ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో మల్లూరి చంద్రకళ మెమోరియల్ సౌజన్యంతో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ప్రారంభించారు. దాదాపు 2 వేల మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. పలు విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. మెదక్ జిల్లా టీం 500 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచిందని అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ కరాటే మాస్టర్ నగేష్ తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మాజీ చైర్మన్ జగపతి, కరాటే మాస్టర్లు చంద్రశేఖర్, ప్రతాప్‌సింగ్, నాదేంద్ర, బాలకృష్ణ, శ్రీనివాస్, రాజు, దినకర్, రియాజ్, నవీన్, మహేష్, రాకేష్ పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న విద్యార్థులు

ఘనంగా మల్లన్న జాతర



పటాన్‌చెరు : మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

● హత్నూర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని మల్లన్న గుట్టలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఒగ్గు కళాకారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అగ్నిగుండాలు, బోనాల ఊరేగింపు నిర్వహించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పటాన్‌చెరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు డివిజన్‌లోని బండ్లగూడ బండల మల్లన్న జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నిర్వహించిన కల్యాణోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోసం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్త్‌క్యాంపును ఏర్పాటు చేశారు. జాతరలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ, నాయకులు మధుసూధన్‌రెడ్డి, కల్పనరెడ్డి, పల్లవీ విక్రంరెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

రెండవరోజు కొనసాగిన మల్లన్న ఉత్సవాలు

నర్సాపూర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ సమీపంలోని మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం రెండోరోజు ఘనంగా నిర్వహించారు. సుప్రభాతసేవ, అభిషేకంతో పాటు ప్రత్యేకంగా గంగకు వెళ్లడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం నిర్వహించే స్వామివారి కల్యాణోత్సవానికి ప్రజాప్రతినిధులు, పలువురు ముఖ్య నాయకులు హాజరవుతారని యాదవసంఘం ప్రతినిధులు తెలిపారు.

అంగన్‌వాడీ స్థలానికి ఫెన్సింగ్



అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ కడీలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

హత్నూర, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నస్తీపూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన భూమి పరిరక్షణకు యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరిగుంతం కృష్ణ నడుం బిగించారు. అంగన్‌వాడీ చుట్టూ సిమెంట్ కడీల ఏర్పాటు చేసి జాలితో ఫెన్సింగ్ వేయించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలో నీలి కుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు నీలి అంజయ్య, ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్, కోశాధికారి సంగమేశ్వర్, సభ్యులు చంద్రయ్య, లక్ష్మణ్, యాదయ్య, ప్రవీణ్, నారాయణమూర్తి, వేణు, శ్రీనివాస్, ప్రకాశం, శివరాజ్, సుదర్శన్ పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారంతోనే ప్రజల మన్ననలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య

రామచంద్రాపురం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలు పరిష్కరించినప్పుడే గుర్తింపు లభిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య అన్నారు. సీపీఎం మహాసభల సందర్భంగా ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి కూడలిలో నిర్వహించిన 2కె రన్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సమస్య పరిష్కారం జరిగితే ప్రజాజీవితంలో మార్పులకు నాందిగా మారుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, నర్సింహారెడ్డి, రాజు, నాగప్రసాద్, జిలానీ, వీరాస్వామి తదితరులు ఉన్నారు.

● పటాన్‌చెరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో జాతీయ రహదారిపై ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో 2కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర నాయకుడు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు వత్తాసు పలుకుతూ ఉద్యోగ, కార్మిక, శ్రామిక వర్గాలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సీపీఎం మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.



రామచంద్రాపురం టౌన్ : 2కే రన్ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దసారు మమ్మల్ని కలుస్తలేరు

(5వ పేజీ తరువాయి)

ర్యాకల శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ.. కేసీఆర్ ఫాంహౌజ్‌లో కూడా తమను కలవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరునెలల క్రితం మండల అధ్యక్షుడు పార్టీని వీడితే ఇప్పటికీ అధ్యక్షుడిని నియమించలేదని అన్నారు. అధ్యక్షుడి ఎన్నిక హైదరాబాద్‌లో చేయొద్దని, కార్యకర్తల సమక్షంలోనే నిర్వహించాలని సూచించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కూడా తమను పట్టించుకోవడం లేదని, కనీసం ఇక్కడికి రావడంలేదని పేర్కొన్నారు. పార్టీ నుంచి గెలిపొందిన సర్పంచులు, ఎంపీటీసీలను పట్టించుకోలేదని, కనీసం గుర్తు పట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కేసీఆర్‌తో ఫాంహౌస్‌కు తీసుకెళ్లి తమను కలిపించాలని నాయకులు, కార్యకర్తలు.. ర్యాకల శేఖర్ గౌడ్‌ను డిమాండ్ చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరెస్టు చేస్తారని ప్రచారం జరుగుతోందని, అరెస్టు చేస్తే మండల అధ్యక్షుడు లేనిపక్షంలో ఎవరి ఆధ్వర్యంలో ఆందోళనలు చేయాలని ప్రశ్నించారు.

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీన్ రెడ్డి

జహీరాబాద్, జనవరి5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పాలకులు విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎవీఎన్ రెడ్డి అన్నారు. మొగుడంపల్లి మండలంలోని అసద్‌గంజ్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవి విరమణ పొందిన గజ్జాడ నర్సింహారెడ్డికి ఆదివారం పట్టణంలోని ఆదర్శనగర్ పార్కులో సన్మానసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తపస్ ప్రధానకార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షులు దత్తాత్రీ, తపస్, ఆర్ఎస్ఎస్ నాయకులు నర్సింహులు, సురేష్ కులకర్ణి, తుక్కప్ప, చంద్రకాంత్, శ్రీపాల్, విజయ్‌కుమార్, మల్లయ్యస్వామి, మొగులయ్య, చంద్రశేఖర్, అన్నపూర్ణ, మోహనక్రిష్ణ, రాము, యాదయ్య, రమేష్, విజయలక్ష్మి, తుకారాం, సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి



చేతికి సంకెళ్లు వేసుకొని మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మెదక్ అర్బన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతున్నది. ఆదివారం మోకాళ్లపై కూర్చుని చేతికి సంకెళ్లు వేసుకొని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజు, కార్యదర్శి పాషా, రాజశేఖర్, సంపత్, శంకర్, కవిత, మంజుల, ధరణి తదితరులు పాల్గొన్నారు.

● సంగారెడ్డి అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దత్తు, జాయింట్ సెక్రటరీ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కుంట పూడికతీత పనులు షురూ



పనులను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలం పరిధి రెడ్డిపల్లి గ్రామంలోని గొల్లకుంటలో మట్టి పూడికతీత పనులను డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆదివారం ప్రారంభించారు. నేషనల్ ఆగ్రో ఫౌండేషన్, నోవారిటీస్ సంస్థ ఆధ్వర్యంలో పూడిక తీత చపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంస్థలు నర్సాపూర్ మండలంలోని 15 పంచాయతీల పరిధిలో సేవలు అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అశోక్‌గౌడ్, నాయకులు శివప్రసాద్‌గౌడ్, నరేష్, కిష్టాగౌడ్, వెంకటయ్య, మహేష్‌గౌడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ భవన నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

సంగారెడ్డి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వీరశైవ లింగాయత్ జిల్లా భవనానికి కృషి చేస్తానని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సంగారెడ్డిలోని జేఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

నీటి వనరుల అభివృద్ధికి శ్రీకారం



బ్రాహ్మణకుంట కట్ట అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న నాయకులు

జిన్నారం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపతిగూడెంలో నేషనల్ అగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణకుంట కట్ట మరమ్మతు పనులు ప్రారంభించారు. ఆదివారం లక్ష్మీపతిగూడెంలో ఏషియన్ పెయింట్ సంస్థ సహకారంతో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నీటి వనరుల సంరక్షణ కోసం ఈ పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

సంగారెడ్డి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి అధ్వర్యంలో ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఆశ్రమ సభ్యులు ప్రశాంత్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నారాయణఖేడ్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అబ్బెంద గ్రామంలో మంజీరా, సర్వోదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రెనోవా వైద్యశాల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు అవసరం ఉన్న రోగులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సాదాబైనామాలకు మోక్షం

(5వ పేజీ తరువాయి)

ఇందులో అనేక కీలక అంశాలున్నాయి. ఇప్పటికే శాసన సభలో ఆమోదం పొందిన ఈ చట్టంపై త్వరలోనే ప్రభుత్వం గెజిట్ విడుదల చేయనుంది.

కీలక అంశాలు

ధరణి స్థానంలో భూభారతి అమలులోకి వస్తే అనేక మార్పులు చోటుచేసుకోనున్నాయని నిపుణులు చెబుతున్నారు. భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి గతంలో పోర్టల్లో 33 మాడ్యూల్స్ ఉండేవి. వాటిని ప్రస్తుతం ఆరు మాడ్యూల్స్‌కు కుదిస్తున్నారు. గతంలో రద్దు చేసిన అనుభవదారుడి కాలమ్‌ను మళ్లీ పునరుద్ధరించనున్నారు. అనుభవదారుడికి ఈ చట్టం రక్షణ కల్పిస్తోంది. ఇక వారసత్వ భూముల విషయంలో పొరపాట్లు జరగకుండా మ్యూటేషన్ మ్యాప్ తప్పనిసరి చేశారు. క్షేత్ర స్థాయి విచారణ జరిపిన అనంతరమే ప్రక్రియ ముందుకు సాగనుంది. ప్రతీ భూమికీ భూ ఆధార్ సంఖ్య ఉంటుంది. హక్కులు బదలాయింపు జరగగానే పహణిలో నమోదయ్యేలా చర్యలు, రైతులు ఎదుర్కుంటున్న భూ సమస్యల పరిష్కారానికి ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేందుకు కొత్త చట్టంలో రూపకల్పన చేస్తున్నారు. ఇంతే కాక 38 ఈ ఓఆర్‌సీ, లావణి పట్టా వంటి భూ సమస్యల పరిష్కారానికి కొత్త చట్టంలో వీలుంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.



అందోల్ హైస్కూల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జోగిపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): అందోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నాటి తమ గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాజశేఖర్ కులకర్ణి, మధుసూదన్, జియావుద్దీన్, చాంద్‌పాషా, రంగయ్య, మాణయ్య, మురళీధర్‌గౌడ్, అనురాధ, వేణుమాధవి, జానకి, సుమతి పాల్గొన్నారు.

● రేగోడు జనవరి 5(ఆంధ్రజ్యోతి): రేగోడు ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్‌కి చెందిన పదోతరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సరస్వతి మాత విగ్రహాన్ని దాత సంగమేశ్వర్ ఏర్పాటు చేయించారు.

● కొండాపూర్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అనంతసాగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన 1992-93 బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



రహదారి నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శంకర్

పెద్దశంకరంపేట, జనవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రహదారి నిబంధనలను పాటించాలని పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం పెద్దశంకరంపేటలోని బస్టాండ్ వద్ద మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రజలకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు కలుగకుండా వాహన దారులు చురకులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పేట పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ సునీత, ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది పాల్గొన్నారు.